క్లుప్తంగా

బాలికలు పోషకాహారం తీసుకోవాలి



రామవరప్పాడు: బాలికలు అధిక పోషకాలు లభించే ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి తెలిపారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జెడ్పీ పాఠశాలలో సోమవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్ణకుమారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాల తయారీని వివరించారు. అనంతరం పోషకాహారంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తాయారు, టాటా ట్రస్ట్ నుంచి కిన్నెర, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు స్వాగతం



గన్నవరం: మండలంలోని పలు పాఠశాలలో నియమితులైన ఆరుగురు కొత్త ఉపాధ్యాయులకు సోమవారం యూటీఎఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. వీరికి సేవా పుస్తకాలు, యూటీఎఫ్ సభ్యత్వ పత్రాలను ఆ సంఘ నాయకులు అందజేశారు. దావాజిగూడెం, గన్నవరం, గొల్లనపల్లి హైస్కూల్‌లో కొత్త ఉపాధ్యాయులకు సాదర స్వాగతం పలికారు. సంఘం జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులుగా కొత్తగా చేరిన వారికి యూటీఎఫ్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. విధులను నిర్వర్తించడంలో ఏ విధమైన అవసరం ఉన్నా తమ సంఘం ఎలప్పుడు తోడుగా ఉంటుందన్నారు. నాయకులు జీవీ రవిబాబు, తాతా శ్రీనివాసరావు, డి.కుమార్, ఎస్.సుజశ్రీ, డి.బాలసుబ్బమ్మ, సీహెచ్ రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో కూటమి చెలగాటం

- ఉయ్యూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రణభేరి
- వినతి పత్రం అందజేత
- కూటమి వైఫల్యంపై నిప్పులు చెరిగిన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



జోరువర్షంలో ర్యాలీగా వస్తున్న దేవభక్తుని చక్రవర్తి, నాయకులు



నకిలీ మద్యంపై నినదిస్తున్న స్థానికులు

ఉయ్యూరురూరల్: ప్రజల ప్రాణాలతో కూటమి సర్కారు చెలగాటం ఆడుతోందని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆరోపించారు. నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రణభేరి కార్యక్రమం ఉయ్యూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. బైపాస్ సెంటర్ నుంచి పార్టీ శ్రేణులు, స్థానికులు నిరసన ర్యాలీగా ఉయ్యూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. నకిలీ మద్యంపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రభుత్వ వైఫ్యలంపై నిప్పులుచెరుగుతూ ఆందోళన సాగించారు. నారా వారి నకిలీ మద్యం అంటూ గొంతెత్తి నినాదాలు చేశారు. ఉయ్యూరు ఎక్సైజ్ శాఖ సీఐ శేషగిరిరావుకు వినతిపత్రాన్ని అందించారు. దేవభక్తుని చక్రవర్తి మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే కల్తీ మద్యాన్ని నిలువరించడంలో విఫలమైన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రిని ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో అన్నింటా కల్తీమయం అయ్యిందన్నారు. నిత్యావసర సరుకులతో పాటు అన్ని రకాల వస్తువులు కల్తీ అయ్యాయన్నారు. చివరికి మద్యం కూడా కల్తీ చేసి అక్రమ సంపాదనకు పాకులాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా కల్తీ మద్యాన్ని తయారుచేసి, విక్రయించి రూ.కోట్లు దండుకోవటం చూస్తే కూటమి పాలనలో ఆయా పార్టీల నాయకులు అనుచరులు దొడ్డిదారిన అక్రమాలకు వచ్చిన సొమ్మును దాచుకోండి దోచుకోండి అనేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఏరులై పారుతున్న మద్యం..

నారావారి పాలన కల్తీ మద్యం కేంద్రంగా మారిందని చక్రవర్తి ఎద్దేవా చేశారు. ప్రజారక్షణ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల కొండగా నిలిచేందుకు పార్టీ విస్తృతంగా కృషి చేస్తుందన్నారు. కల్తీ మద్యాన్ని ఇతర ప్రభుత్వ అవినీతి అక్రమాలను అడుగడుగున అడ్డుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పోరుబాటకు అధినేత జగన్ పిలుపునిచ్చారన్నారు. ఈ పిలుపుతో యావత్తు ప్రజలతో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఎక్సైజ్ శాఖ అధికార యంత్రాంగం కళ్లు తెరిపించేలా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసేలా ఆందోళన చేపట్టామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందకు పైగా బెల్టుషాపులు గ్రామ గ్రామానా ఏర్పడ్డాయన్నారు. వైన్ షాపుల యాజమాన్యాలు, కూటమి నాయకుల ప్రోత్సాహంతో అక్రమ సంపాదనకు తెర తీసేందుకు గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కొక్క వైన్ షాపు పరిధిలో సుమారు 15 నుంచి 20 వరకు అనాధికారికంగా బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యాన్ని మరింత విక్రయించేలా ప్రభుత్వం దొడ్డిదారిన ప్రోత్సహిస్తుందన్నారు. అక్రమ వ్యాపారం ద్వారా కూటమి అనుయాయులు, వైన్ షాపుల యాజమాన్యాలు కోట్లాది రూపాయలకు పడగలెత్తుతున్నారన్నారు. బహిరంగంగా, యథేచ్ఛగా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నప్పటికీ ఏ ఒక్కరు స్పందించక పోవడం స్థాయిలో ఉన్న అధికారులకు ప్రజాప్రతినిధులకు పార్టీల నేతలకు ముడుపులు అందటమే కారణమని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విషపూరితమైన కల్తీ మద్యాన్ని తయారు చేసి దొడ్డి దారిన విక్రయించి సొమ్ము చేసుకున్న అక్రమార్కులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు షేక్ అబ్దుల్ కలాం, దాసే రవి, నియోజకవర్గ వివిధ విభాగాల నాయకులు శ్రీకాంత్, బ్రహ్మ నాయక్, జంపాన కొండలరావు, కౌన్సిలర్ గుంజా సుధాకర్, మహిళా నేతలు రామినేని రమాదేవి, బాలి, రాజేశ్వరి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జోరువానలోనూ సాగిన ఆందోళన..

నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ రణభేరి కార్యక్రమం జోరు వానలోనూ సాగింది. ఉదయం నుంచే భారీ వర్షం కురుస్తున్నా పార్టీ పిలుపునందుకుని పార్టీ శ్రేణులు, స్థానికులు ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. బైపాస్‌సెంటరు నుంచి జోరు వర్షంలో తడుస్తూనే కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నారంటూ మండిపడ్డారు.

ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలు చేపట్టాలి



పెనమలూరు: ఖరీఫ్ ధాన్యం సేకరణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వ్యవసాయశాఖ, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖలతో ఆయన సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణ మండలంలో ఏడు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ గ్రామంలో రైతులకు ధాన్యం సేకరణపై అవగాహన కల్పించాలని సూచించారు. పీపీఎస్‌యాప్‌తో ముందుగా ధాన్యం తరలించటానికి వాహనాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఒక్కో రైతు సేవా కేంద్రానికి తొలిదశగా 5 వేల చొప్పున గన్నీ బ్యాగ్‌లు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. రెవెన్యూ, వీఏఏలు సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ప్రణాళికతో పని చేయాలన్నారు. ధాన్యం గిట్టుబాటు ధర ఇవ్వాలని ఏ గ్రేడుకు 75 కేజీలకు రూ.1,792, సాధారణ రకం రూ.1,777 ధర ఇవ్వాలన్నారు. ఏడీఏ ఎం.సునీల్ మాట్లాడుతూ ధాన్యం సేకరించే సమయంలో రైతులు తేమ శాతం 17 ఉండేట్లు చూసుకోవాలన్నారు. చెడిపోయిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం గింజలు 4 శాతం మించరాదని సూచించారు. రైతులకు ధాన్యం తేమ శాతం తగ్గించటానికి ధాన్యం ఆరపెట్టుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ గ్రాంట్‌లు విడుదల చేయాలి

మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ ప్రసన్నకుమారి



మండల పరిషత్ సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, అధికారులు, నేతలు

విజయవాడరూరల్: సీఆర్‌డీఏ నుంచి గ్రామాలకు రావాల్సిన గ్రాంట్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి కోరారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గుజ్జర్లపూడి బాబురావు మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై, గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. డెప్యూటీ ఎంపీడీఓ ఎండీవీ ప్రసాద్ సమాధానమిస్తూ నేషనల్ హైవేపై డ్రెయినేజీ సమస్యను నేషనల్ హైవే అధికారులు పరిష్కరించాల్సి ఉందన్నారు. వారు పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో పనులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు లేవని, సీఆర్‌డీఏ నుంచి గ్రామాలకు రావాల్సిన బిల్డింగ్ ఫీజు, స్టాంప్ డ్యూటీ రావడం లేదని దీంతో గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందులున్నాయని చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ప్రసాదంపాడు గ్రామంలో ఆర్థిక పరమైన సమస్యలున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంటులను విడుదల చేసేందుకు అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ద్వారా ప్రయత్నం చేయాలని సూచించారు.

అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ..

నేషనల్ హైవేపై ఉన్న గ్రామాల పారిశుద్ధ్య సమస్య పరిష్కరించడానికి వీఎంసీ మున్సిపల్ కమిషనర్‌ను కలుద్దామన్నారు. పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి వాటి నిర్వహణ బాధ్యతలను తీసుకోవాలని కమిషనర్‌ను కోరనున్నట్లు తెలియజేశారు. ఏడాదిన్నర నుంచి ప్రసాదంపాడు గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని ఎంపీపీ అన్నారు. గ్రామాలకు రావాల్సిన గ్రాంట్లు రావడంలేదని దీంతో అభివృద్ధి పనులు చేయలేక పోతున్నట్లు రామవరప్పాడు సర్పంచి వి.శ్రీదేవి అన్నారు. అంబాపురం గ్రామంలో కామన్ స్థలాల ఆక్రమణలు పెరుగుతున్నాయని అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచి సీతయ్య అన్నారు. ఎంపీటీసీ జి.అజిత భర్త బాబురావు మండల సమావేశంలో పాల్గొని మాట్లాడటం పట్ల పలువురు సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తొలుత ఏఎంసీ చైర్మన్ జి.నరసింహారావును ఎంపీపీ, ఎంపీటీసీ జి.అజిత, అధికారులు సత్కరించారు. వ్యవసాయం, విద్య, ఐసీడీఎస్, తాగునీటి అంశాలపై రివ్యూ చేశారు. అధికారులు, నేతలు పాల్గొన్నారు.

వికాస్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైంది. ఇండస్ట్రీ 5.0 నేపథ్యంలో స్మార్ట్ మెటీరియల్స్ వినియోగం, ఆధునిక సాంకేతికతలలో ఆధునిక పద్ధతులు అనే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఐఐటీ తిరుపతి యాంత్రిక ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ మామిళ్ల రవిశంకర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యాసంస్థలు, పరిశ్రమలు మధ్య ఉన్న అనుసంధానాన్ని బలపరిచి, పరస్పర అవగాహనను పెంపొందించడంలో ఇలాంటి ఎఫ్‌డీపీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఎఫ్‌డీపీలో మొదటి రోజున ఆధునిక పరిశ్రమల్లో విస్తృతంగా వినియోగిస్తున్న అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ సాంకేతికలు గురించి వివరించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 21 విద్యా సంస్థలకు చెందిన 50 మంది అధ్యాపకులు ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. ఎఫ్‌డీపీలో ఐఐటీ తిరుపతి, ఎస్‌ఐటీ ఆంధ్రప్రదేశ్, ఇస్రో, డీఆర్‌డీఓ, ఎస్‌ఎస్‌టీఎల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్(బెంగళూరు), ఏపీఎస్‌సీహెచ్ వంటి ప్రముఖ సంస్థల నుంచి ఏడుగురు నిపుణులు వివిధ అంశాలపై ప్రసంగించినట్లు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి, పలువురు హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

జీవితంలో శారీరక, మానసిక ఆరోగ్యం ముఖ్యం

పెనమలూరు: మనిషి జీవితంలో మానసిక ఆరోగ్యం కీలక పాత్ర అని జిల్లా లయన్స్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు తెలిపారు. కానూరు నారాయణ కాలేజీలో లయన్స్ ఇంటర్నేషనల్ 316డి ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మానసిక ఆరోగ్యంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మనిషికి శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం కూడా అంతే కీలకమన్నారు. లయన్స్ క్లబ్ సమాజసేవలో ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. ఏపీ అకడమిక్ డైరెక్టర్ బ్రహ్మజీ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యం విద్యా వ్యవస్థలో భాగం కావాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ బావిశెట్టి రమేష్ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో జిల్లాలో 9 వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఆయన రాసిన 'ఏ హోలిస్టిక్ గైడ్ టు మెంటల్ వెల్ బీయింగ్' పుస్తకాన్ని లయన్స్ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో లయన్స్ అన్నపరెడ్డి కోటిరెడ్డి, జె.రాజేశ్వరి, శ్రీనివాసరెడ్డి, చక్రధర్, ముత్యుప్రసాద్, డీన్ శైలజ, ప్రిన్సిపాల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

17న గంగానమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో నూతనంగా నిర్మించిన శ్రీగంగానమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఆగమాచార్య, శతాధిక ప్రతిష్టాపనాచార్య పరాశరం రామకృష్ణమార్యుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 15న విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, అఖండ దీపారాధన, దీక్షా స్వీకరణ, మృత్సంగ్రహణ, అంకురారోపణ, వాస్తు పూజ, వాస్తు హోమం, సర్వాగ్ని కుండేషు అగ్నిప్రతిష్ఠా జరుగుతుందన్నారు. 16న అమ్మవారి ఊరేగింపు, మహాశాంతి హోమం, 17న గంగానమ్మ తల్లి, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ, మహా అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని చెప్పారు.

కనకమహాలక్ష్మి బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం



గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది.కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్‌ను సోమవారం ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు సోమవారం ప్రారంభించారు. తొలుత విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావుతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ.. దేశ ఆర్థిక అభివృద్ధిలో సహకార బ్యాంక్‌లు కీలకంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. చిన్న, మధ్య తరహా ప్రజలకు, రైతులకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో తమ బ్యాంక్ 36వ శాఖను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు బ్యాంక్ చైర్మన్ కె.రాంబాబు తెలిపారు. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, బ్రాంచ్ మేనేజర్ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

పెనమలూరు: యనమలకుదురులో గ్రామంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఆజం చిహ్నమైన జెండాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఇందిరానగర్ నుంచి జెండా చెట్టు వరకు ఊరేగించారు. అనంతరం జెండాలను ఇందిరా నగర్ జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 4 వేల మందికి అన్నసమారాధన చేశారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పీజీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

కంకిపాడు: పీజీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.భావనారాయణ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. గ్యాస్ సిలెండర్ సబ్సిడీ సొమ్ము విడుదల కాలేదంటూ ఓ అర్జీ సమర్పించారు. దీనిపై సంబంధిత శాఖకు చర్యలు నిమిత్తం ఆదేశించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన సమస్యలను పూర్తి స్థాయిలో విచారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీదేవి నేతృత్వంలో హార్ట్ ఎటాక్ వచ్చిన వారిని ఆస్పత్రిలో చేర్చేలోపు సీపీఆర్ ద్వారా విలువైన ప్రాణాలను ఎలా కాపాడటంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రసవం జరిగినప్పుడు పుట్టిన బిడ్డకు సీపీఆర్ ఏ విధంగా చేయాలో చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సల్మా సిబ్బందికి వివరించారు. సీపీఆర్ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 17వ తేదీ వరకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సీపీఆర్‌తో అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. డాక్టర్ రేచల్, ఫిజియోథెరిపీస్ట్ సృజన, హెడ్ నర్సు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేడు మాస్టర్ ప్లాన్‌పై అభిప్రాయ సేకరణ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో మాస్టర్ ప్లాన్ రూపొందించటానికి మంగళవారం అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు పోరంకి ద్వారకా రెసిడెన్సీలో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. ఏపీ సీఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్ రూపొందించటానికి రెండు సంస్థలకు బాధ్యలు అప్పగించారని ఆయా సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరవుతారని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో రహదారులు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిపై జరుగుతున్న అభిప్రాయ సేకరణలో స్థానికులు పాల్గొనాలని కమిషనర్ నజీర్ కోరారు.